# 'విశాల'

## అద్దంకి శేషగిరిరావు



"మీ యింటి చిన్నభాగం అద్దెకు వున్నదిట చూడనిస్తారా?" అని ఒక ముప్పై సంవత్సరాల యువతి రామయ్యగారింటికివచ్చి ఆయన భార్యను అడిగింది. "అవ్వే, ఒక్క గదేనమ్మా, వెనుక ఉంది. ప్రక్కనున్న వంచపాళీ కూడా. కావలిస్తే వాడుకోవచ్చు. మీ రెంత మందేవిటి?" అని అడిగింది. "నే నొక్కర్తెనేనమ్మా" అంది విశాల. "ఆ గది కూడా మా కోడలు వస్తే రెండు మూడు నెలలు తరువాత కావలసి వస్తుందేమో" అంది ఆవిడ. "మీ కెప్పుడు కావలసివస్తే అప్పుడు ఖాళీ చేస్తానండి" అంది విశాల. "నెలకు నాలుగు రూపాయలు అద్దె; ముందే ఇచ్చేయాలి" అంటే "అలాగే నమ్మా" అని, నాలుగు రూపాయలు ఇచ్చి వెళ్ళిపోయి, ఆ మర్నాడు ఒక పెట్టె, ఒక చెంబు, బాల్చీ, రెండు గిన్నెలు, ఒక కుంపటి, ఒక చాప తీసుకువచ్చి విశాల ఆ యింట్లో దిగింది. ఏదో ఉద్యోగంకోసం వచ్చేనని చెప్పింది.

రోజూ తొమ్మిది గంటలకల్లా ఏదో వండుకొ తిని, పైకివెళ్ళి, సాయంకాలంలోపున ఇంటికి వచ్చి, ఏదో తిని, పండుకొనేది. ఇలా రెండు రోజులు గడిచేక ఒకనాడు ఉదయాన్నే రామయ్యగారిని "మీరు ఛైర్మనుగారి పిల్లలకు చదువు చెబుతూంటారా?" అని విశాల అడిగింది. "అవునమ్మా, ఏదో ప్రైవేట్లు చెప్పుకుని బ్రతుక్కొస్తున్నా. అబ్బాయి కేదో ఉద్యోగం కలిసివచ్చేలాగుంది. ఇటుపైని తగ్గించేయాలి, ఓపిక తగ్గుతూంది" అన్నాడు ఆయన. "మీరంటే ఛైర్మనుగారికి చాలా గౌరవమని విన్నాను" అంది. "ఏదోలే అమ్మా. ఆయన కూడా నాదగ్గర చదువుకున్నవాడే, అంతే" అన్నాడు. "మీరు నాకో ఉపకారం చేసిపెట్టాలి. ఇక్కడ ఆడపిల్లల స్కూళ్ళలో రెండు మూడు ఖాళీలు ఉన్నాయిట. నా నడవడి గురించి ఇక్కడ ఎవరైనా సర్టిఫికెటు ఇస్తే ఉద్యోగం ఇస్తామన్నారు. కాని నాకు ఇక్కడ ఎవరు తెలియదు మీరు కాస్త చెబితే ఇస్తారనుకుంటాను" అంది. "సర్టిఫికెటు ఇవ్వడానికి నేనెంతవాణ్ణి? అయినా కనుక్కుంటా. నువ్వు స్కూలు ఫైనలు పేసయేవా?" అని అడిగేడు. "ఆ" అని మాత్రం జవాబు చెప్పింది.

ఆ రోజే ఛైర్మనుగారింటికి వెళ్ళినపుడు ఆమె వారి యింటిలోనే ఉంటున్నట్లు చెప్పి ఒక చిన్న ఉద్యోగంలో వేయించేడు. రామయ్యగారు ప్రైవేట్లు చెప్పుకోడానికి ఎప్పుడు తిరుగుతు ఉంటాడు. మధ్యాహ్నం పదకొండుకు ఇంటికివచ్చి, భోజనంచేసి, ఒక గంట విశ్రాంతి తీసుకుని, మళ్లా పోయి, రాత్రి ఎనిమిది గంట

లకు ఇల్లు చేరుకుంటాడు. భార్య ఒక్కర్తె ఉండలేక ఇరుగుపొరుగు ఇండ్లలో కాలం గడుపుతూ ఉంటుంది. రాత్రులు దేవాలయంలో పురాణం వినడానికి వెళ్ళడం మామూలు. విశాల కూడా ఆమెతో ఒకటి, రెండుసార్లు రమ్మంటే వెళ్ళేది.

## 2

“ఏమండీ విశాలమ్మగారూ పదిహేనవ తారీఖున మన స్కూలు ఇన్‌స్పెక్షను. ఈ లోపుగా మీరు మీ సర్టిఫికెట్లు తీసుకువచ్చి స్కూల్లో ఇవ్వాలి” అని స్కూలు హెడ్ మిస్ట్రెసు ఆవిడతో ప్రత్యేకంగా చెప్పేరు. విశాలమ్మగారు ఆ బడిలోచేరి దగ్గర దగ్గర ఆరు నెలలైంది. అయినా ఆ బడిలో ఆమె గురించి ఎవరికీ అట్టే తెలీదు. ఆమె ఒక చిన్న మ్యునిసిపల్ ఎలిమెంటరీ స్కూల్లో టీచరు. ఎవరో శలవు పెట్టగా వచ్చిన ఖాళీలో వేసేరు. అందుచేత క్రొత్తగా వచ్చిన ఈమెకు అందరికన్న తక్కువ క్లాసులు ఇచ్చేరు. ఎవరు బడికి శలవు పెట్టినా ఆ పని ఆవిడకు అంటకట్టడం అలవాటైపోయింది. ఏ క్లాసుకు పంపించినా, ఏ సబ్జక్టు చెప్పమన్నా ఆమె వెళ్ళి అతి శ్రద్ధతో పిల్లలకు నచ్చేటట్టు అంతకు ముందు మామూలుగా చెప్పే టీచరుకంటె చాలా బాగా చెప్పేవారు. అంచేత అందరు పిల్లలకు ఆమె అంటే చాలా గౌరవం. ఎవరిని ఎప్పుడు తిట్టడం, కొట్టడం, కోప్పడ్డం సైతం ఉండేదికాదు. చిరునవ్వు నవ్వినప్పుడు కూడా ముఖంలో ఏదో విషాదం గోచరిస్తూ ఉండేది. అంచేత ఆమె భర్తను పోగొట్టుకుని ఏదో కష్టదశలో ఉందనుకునేవారు. కాని ధైర్యంచేసి ఎవరు ఆమెను అడగలేకపోయేవారు. కల ఉన్నా బొట్టు, సింగారం ఉండదు. అందుచేత వితంతు వనుకున్నారు. అవసరం ఉన్నప్పుడు మాత్రం అతి ముక్తసరిగా మాట్లాడేది. ఎవరితోను స్నేహంలేదు, విరోధం లేదు. మీ దేవూరంటే నెల్లూరని, తన తండ్రిగా రచట ఏదో చిన్న ఉద్యోగం చేసేవారని చెప్పేది. తనకు దగ్గర బంధువు లందరిని పోగొట్టుకున్నానని, ఒక మేనత్త బొంబాయిలో ఉందని చెప్పేది. ఆమెకు ఎప్పుడు, ఎక్కడనుంచి బడికి కాని, ఇంటికి కాని ఉత్తరాలు రావటంలేదు.

బడిలో ఉన్నంతసేపు ఎప్పుడు ఏ పిల్లవచ్చి ఏ విషయం అడిగినా విసుక్కోకుండా చెప్పేది. ఎప్పుడేనా కొంచం తీరుబడి కలుగుతే, పుస్తకాలు దిద్దుకోడములో మునిగిఉండేది. పత్రికలు కాని, నవలలు కాని, డిటెక్టివులు కాని ఆమె చదువుతూండగా ఎవరు చూడలేదు.

బడి విడిచిపెట్టేక పిల్లలను కొంతసేపు ఆడించాలని కమిషనరుగారు నియమం చేసేరు. చాలామంది పిల్లలు ఒక గంట ఏవో ఆటలు ఆడుకొని ఇంటికి పోయేవారు. ఉపాధ్యాయులు కొంతసేపు ఉండిపోయేవారు. విశాలమ్మగారు మాత్రం అందరు పిల్లలు ఆటలు ముగించి ఇళ్ళకు పోయేవరకు ఉండేవారు.

ఒక రోజు విద్యాలయంలో భగవద్గీత పోటీ పరీక్ష పెట్టేరు. దానికి కొందరు బాలికలు కూడా వెళ్ళారు. అందులో పది సం.ల వయస్సుగల ఛైర్మనుగారి కుమార్తెకు మొదటి బహుమానం వచ్చింది. అది ఆయనకు ఆశ్చర్యం కలిగించగా “నీకు ఎవరమ్మా భగవద్గీతలు చెప్పేరు?” అని అడిగేరు. ఆటలు అయ్యేక ప్రతి రోజు విశాలమ్మగారు పదిమంది పిల్లలకు భగవద్గీతలు చెబుతున్నారని ఆమె చెప్పింది.

ఇంతలో రామయ్యగారి కుమారుడు, కోడలు వస్తున్నారని తెలియడంచేత విశాలమ్మగారు ఇల్లు ఖాళీ చేయవలసి వచ్చింది. ఎక్కడైనా చిన్న భాగం అద్దెకుంటే తనతో చెప్పవలసిందని ఆమె స్కూలు పిల్లలతో చెప్పింది. ఛైర్మనుగారి కుమార్తె తండ్రిదగ్గరకు వచ్చి, ఈ విషయం చెప్పి, తమ ఇంట్లో ఒక గది ఇమ్మని బ్రతిమిలాడింది. కాని అద్దెకు ఇవ్వడం తన దర్జాకి లోటు, ఉట్టినే ఉండడం ఆమెకు ఇష్టంలేదు. అందుచేత ఆమె రోజూ ఒకగంట చదువు చెప్పడానికి ఆమెకు ఒక గది, ఒక వసారా ఇవ్వడానికి నిశ్చయం చేసేరు.

ఇనస్పెక్షను ఇంకా పది రోజులున్నా యనగానే అందరు తమ సర్టిఫికెట్లు తెచ్చి ఇచ్చేసేరు. కాని విశాల ఇవ్వలేదు. స్కూలు ఫైనల నంబరు, సంవత్సరం జ్ఞాపకమున్నాయు అవి చెప్పి, తరవాత సర్టిఫికెటు తెప్పిస్తానని చెప్పింది. గెజిటు తెప్పించి ఆ నంబరు చూసేరు. దానిలో పేసైనట్టే ఉంది. కాని పేర్లు రెండు ఉన్నట్లుంది. విశాల లేక చెల్లాయి అని ఉంది. ఆ రెండోది ఇంట్లో పిలిచే పేరని ఆమె చెప్పింది.

## 3

స్కూలు ఇనస్పెక్షన్ రోజు వచ్చింది. ఇందిరమ్మ అనే క్రొత్త ఇనస్పెక్ట్రెస్ వస్తూందని తెలిసి హెడ్ మిస్ట్రెస్ చాలా భయపడుతూంది. ఆవేళ విశాలమ్మ జ్వరంగా ఉందని సెలవు చీటీ పంపింది. శలవు నిరాకరించి, బండీ మీదైనా మధ్యాహ్నం బడికి రావాలని హెడ్ మిస్ట్రెస్ వ్రాసింది. విధిలేక విశాలమ్మ బడికి వచ్చింది.

ఇందిర బి. ఎ. లో చెల్లాయితో చదువుకుంది. బాగా తెలుసు. తనను చూస్తే పోలుస్తుంది. అందుకోసం తప్పించుకుందామని ప్రయత్నం చేసింది. అక్కడ ఎవరికి తనను తెలియదు కదా అని అక్కడ ఉద్యోగంలో చేరింది. ఇప్పు డెలాగ అని ఆలోచించింది. మధ్యాహ్నం ఆమె భోజనంచేసే సమయానికి స్కూలుకువచ్చి, ఒక చిన్న చీటీ ఆమెకు పంపింది. “అయిదు నిమిషాలు ప్రత్యేకంగా మిమ్ములను చూచుటకు అవకాశం ఇవ్వవలసింది” ఇట్లు మీ చెల్లాయి—అని ఇంగ్లీషులో వ్రాసింది. వెంటనే ఆమెను లోనికి తీసుకురమ్మని, వచ్చేక బంట్రోతును పంపివేసి, “ఏమిటి చెల్లాయి ఇలాగున్నావేమిటి? ఇక్కడి కెందుకొచ్చావు, ఎలాగొచ్చావు, ఎప్పుడొచ్చావు, ఎవరితో.........” అని ప్రశ్నల వర్షం కురిపిస్తూ చెయ్యి కడుక్కుంటూంటే, నోటిమీద చేయి వేసుకుని, తలుపువైపు చూపిస్తూ, ఆమెకు అడ్డువచ్చి, “తరువాత మీ బసకువస్తా, అన్ని విషయాలు మాట్లాడుకుందాం. ఇక్కడ ఇప్పుడు నన్నేమీ అడక్కు.. ఇక్కడ ఉండేవారి కెవరికీ నన్ను బాగా తెలిసినట్లుగాని, నా గురించి గాని ఏమి చెప్పవద్దని నా ముఖ్యమైన కోరిక” అని మెల్లగా, తలుపులకు చెవులున్నాయేమో అన్నట్లు చెప్పింది. రెండు నిమిషాలు ఆమెవైపు తేరిపార చూచి, లేచి వచ్చి, దగ్గరగా తీసుకుని కౌగలించుకుని “సరే నీ యిష్టం. బడి మూయగానే తిన్నగా బసకే పోతా. తప్పక వెంట రా” అంది ఇందిర.

## 4

విశాల మదరాసులో బి. ఎ. చదువుతూండగా ఒక ఇంజనీరింగు పేసైన యువకుడు కోరి పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళయిన ఏడాదిలో సంతానం కలిగింది, చదువు చాలించింది. ఇద్దరు కొడుకులు, ఒక కూతురు కలిగేరు. ఇక సంతానం చాలనిపించింది వారిరువురకు. అతడు ఆపరేషను చేయించుకున్నాడు. తరువాత ఒక సంవత్సరానికి మసూచి వచ్చి ముగ్గురు పిల్లలూ పోయేరు. ఆయనకు కూడా వచ్చింది కాని తేరుకున్నాడు. దాంతో చెల్లాయికి చాలా బాధ కలిగింది. ఎలాగైనా సంతానం కావాలని ఆమె మనస్సు బాధించడం మొదలు పెట్టింది. భర్త ఆమె విచారం చూసి “నువ్వు మళ్ళా బి. ఎ. పరీక్షకు చదువు., మనశ్శాంతి కలుగుతుంది” అన్నాడు. కాని ఆ గ్రామంలోని కాలేజీలో ఆమె చదవాలన్న సబ్జక్టు లేదు. అందుచేత ఒక సంగీతం మేష్టరును పెట్టి ఆమెకు సంగీతం చెప్పించడానికి ఏర్పాటు చేసేడు. కొద్దికాలంలోనే ఆ సంగీతం మేష్టర్వ ఆమె దౌర్బల్యం కనిపెట్టి ఆమెను పడతొయ్యడానికి ప్రయత్నం మొదలెట్టేడు. పాఠం అయిపోయేక కూడా బాతాఖానీ వేస్తూ ఉండేవాడు. ఆమెకు భయంవేసి సంగీతం మానేస్తానని భర్తతో చెప్పింది. కారణం మాత్రం చెప్పలేదు. అంచేత అత డందుకు సమ్మతించలేదు.

ఇది ఇలాగుండగా ఇంజనీరుగారు నాలుగు రోజులు గ్రామాంతరం ఉద్యోగరీత్యా వెళ్ళ

వలసి వచ్చింది. కాని అనుకోకుండా రెండు రోజుల్లోనే అతడు తిరుగవచ్చేసేడు. వీధి తలుపులోపల గడియ వేయబడి ఉంది. సాయం కాలం ఏడు గంటలౌతుంది. తలుపు కొట్టేడు. తలుపు తీయడం కొంత ఆలశ్యం అయింది. తీసిన తరువాత అతడు లోనికివెళ్ళాడు. అప్పుడే సంగీతం మేష్టరు నమస్కారంపెట్టి పైకి నడిచేడు. భర్త ఆమెను అనుమానించి ప్రశ్నించేడు. ఆమె ఏమీ జవాబు చెప్పలేక పోయింది. కన్నీరు కారుస్తూ నిలబడ్డది. 'నువ్వు ఈ వెధవ నాటకం ఎంతకాలమాయి ఆడుతున్నావు?'' అని ఒక చెంపకాయ సాగ దీసి కొట్టేడు. దానికి కూడా జవాబు చెప్ప లేక ''క్షమించండి'' అని మాత్రం అనగలి గింది. ''ఛీ, నీ మొహం చూడకూడదు, ఫో'' అని కాలుతో తన్ని తన గదిలోకిపోయి పండు కున్నాడు.

మర్నా డుదయం లేచేసరికి చెల్లాయి ఇంట్లో ఎక్కడా కనపడలేదు. బంట్రోతుచేత కాఫీ తెప్పించుకు తాగేడు. ''అమ్మగారు వూరి కెళ్ళేరా అండి? అని బంట్రోతు అడుగుతే 'ఔను'' అని వూరుకున్నాడు. బంట్రోతే హొటలునుంచి భోజనం తెచ్చిపెట్టేడు. ఆమె పుట్టింటికి వెళ్ళి ఉంటుం దనుకున్నాడు. అందరితో ఆలాగునే చెప్పేడు. సంగీతం మేష్టరు మరి అటువైపు రానేలేదు. జీతం కూడా అడగలేదు.

ఇలా పది రోజులు గడిచేక ఇంజనీరుగారి మామగారి వద్దనుండి జాబు వచ్చింది. దానిలో చెల్లాయి వారింటికి చేరినట్టు లేదు. తమ కూతురు, అల్లుడు క్షేమ సమాచారములు చాలా రోజులనుండి తెలియులేదని, అంతా క్షేమంగాఉన్న సంగతి వెంటనే వ్రాయవలయు నని, తాను కొద్ది రోజుల్లో కాశీయాత్రకు బయలుదేరా లనుకుంటున్నానని, వీలు చూచు కొని దారిలో దిగి వారిని చూచి వెళతానని అందులో ఉంది. అప్పుడు ఇంజనీరుగారికి అనుమానం వేసింది., ఒక విధంగా భయం కూడా కలిగింది. ఆమె ఎక్కడకు వెళ్ళిందో కనుక్కోవాలన్న బుద్ధి కూడా పుట్టింది. సంగీతం మేష్టరుతో పోలేదు., అతడు అక్కడే రెండు మూడుసార్లు కనపడ్డాడు. ప్రాణ త్యాగం చేసిందా? అని అనుమానం కలిగింది. ఒకవేళైతే శవం కనపడకుండా ఎన్నాళ్ళుంటుంది? పోలీసులకు చెబుదామా? అనుకున్నాడు. ఒక వేళ తనమీదకే కేసు వస్తుందేమో?''పది రోజులక్రితం మా గ్రామం వెళతానని వెళ్ళింది'' అని మామగారికి వ్రాసేస్తే తీరి పోతుంది. ఆయనే తంటాలు పడతాడు. అటువంటి దానితో తన కెందుకు ఇంక ఆత్రుత?—అనిపించింది. నగలు, పట్టుచీరలు అవీ పట్టుకుపోయిందా అని అనుమానం తోచి పెట్టె తాళం విరగ్గొట్టి తీసేడు. దానిలో ఆమె నగల పెట్టెలో నగలన్నీ పదిలంగా ఉన్నాయి. చేతులకుండే రెండు జతల గాజులు, మంగళసూత్రం మాత్రం లేవు. విలువైన పట్టు చీరలు అన్నీ ఉన్నాయి. రాబోయే పండుక్కి తను కొన్న బెంగుళూరు చీర కూడా అలా మడతతోనే ఉంది. డబ్బేమైనా తీసుకు పోయి ఉంటుందా, అంటే డబ్బు బేంకులో ఉంటుంది. ఉత్తరం ఒకటి బీరువాలో. దాని మీద తన ఎడ్రస్సే ఉంది. అది ఆమె దస్తూరీలా కనపడ్డది. దానిపై పోష్టుముద్ర లేదు. ''మీరు మాత్రమే చూచి చింపివేయ వలెను'' అని కూడా వ్రాయబడి ఉంది. దానిలో—

పూజ్యులైన దైవ సమానులకు,

నేను మీకు చెప్పరాని, మరువరాని, క్షమింపరాని అపరాధాన్ని చేసేను. మీరు నన్ను చూచి అసహ్యించుకోడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. నన్ను చూచి నేనే అసహ్యించుకుంటు న్నాను. నేను ఇంత అపచారం చేయడానికి ఒకటే కారణం—నాకు ఎలాగైనా సంతానం కావాలన్న కోరిక. ఇది నా దౌర్బల్యం—దానిని దాచలేకపోయేను. గోతులో—మురికి గోతులో— పడ్డాను. ఇప్పుడు కూడా మిమ్మల్ని మన స్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. మీరు నా మూలంగా ఎంత అవమానానికి, దుఃఖానికి, అసౌఖ్యానికి లోనౌతారో తలుచుకోలేకుండా ఉన్నాను. కాని మీరు నా మాట నమ్మరు. అలా నమ్మడానికి వీలులేకుండా నేనే చేసు కున్నాను. మీకు నా ముఖం—ఒకప్పుడు ప్రేమించి మురిసిపోయిన ముఖం—ఇప్పుడు ఎంత అసహ్యకరంగా కనబడుతుందో నాకు బాగా తెలుసు. ''ఎంతకాలమాయి ఈ నాటకం ఆడుతున్నా''వని అడిగేరు. నిజం చెబితే మీరు నమ్ముతారా? నమ్మరని నిశ్చయంగా నాకు తెలిసి నేను చెప్పలేదు. కాని ఇప్పుడు చెబుతున్నా. అదే ప్రథమం., అదే ఆఖరు.

మగవారికి పిల్లలులేని లోటు కనపడ దేమో అనుకుంటాను. మీరూ మన పిల్ల లను చాలా ప్రేమించేవారు. కాని వాళ్ళని పోయేక నాలాగ విచారిస్తున్నట్టు కనపడదు. పెంచుకుందామని ఒకటి రెండుసార్లు అన్నారు. కాని కన్నబిడ్డడే బిడ్డడు, కన్న కూతురే కూతురు. ఎంత గారాబంగా చూచినా, ఎంత చిన్నప్పటినుంచి పెంచినా— అనాథ బిడ్డ అయినాసరే— నా కన్నబిడ్డతో సమానంకారు. ఇది నా మతం; నా బాధ ఎవరికి తెలుస్తుంది ?

మీ కోపంతో ఈ రాత్రి నన్ను ఏదో విధంగా చంపుతారనే ఆశ కలిగింది. అంచేత అలా మేలుకునే పండుకున్నట్టు నటించేను. పన్నెండు, ఒంటిగంటవరకు మీరు మేలుకునే వుండడం గమనించేను. కాని నా వైపు మీరు రాలేదు. రెండు గంటలకు నిద్రలో వున్నారు. ఇంక లాభంలేదని నేనే ఏదో వుపాయం చూసుకుందామని నూతిదగ్గరకు వెళ్ళేను. కాని లాభంలేదనిపించింది. మీరు లేవవచ్చు. మీమీద కేసు రావచ్చు. కనుక ఇక్కడ ఏమీ కూడదనుకున్నాను. నిండు ప్రాణం తీసుకోడానికి తగిన ధైర్యం నాలో లేదేమో అనిపించింది. ముందు ఇక్కడ నుండి మీకు నా ముఖం కనబడకుండా పోతే తరవాత ఆలోచించుకోవచ్చునని, నాలుగు గుడ్డలు చిన్న సంచిలో పెట్టుకుని వెళ్ళ తున్నా. నా నగలన్నీ పెట్లోనే వున్నాయి. అవి మీ ఇష్టంవచ్చినట్టు వుపయోగించు కొండి. తెల్లవారిపోతూంది కనక జాబు ముగిస్తున్నాను. ఈ జాబు మీరు తప్ప ఎవరూ చూడకూడదని నా కోరిక. అవసర మైతే పోలీసులకు చూపండి. ఇవే నా ఆఖరు నమస్కారాలు. ఎప్పటికైనా మీరు క్షమించగలిగితే నా ఆత్మకు శాంతి కలుగ తుంది.

ఇట్లు,

మీ పాద దాసి,

విశాల.

ఈ వుత్తరం చదవగానే ఇంజనీరు రామారావుకి తెలియకుండానె కంటివెంబడి రెండు చుక్కలు రాలేయి. దానిప్పుడేం చెయ్యాలి ? ఆమె వ్రాసిందంతా నిజంలాగే తోచింది. ఏమి చేసి వుంటుంది ? ఏ బండో కట్టుకుని ఏ నూతిలోనో పడివుంటుం దేమో ? ఎలా తెలుస్తుంది ? పది రోజు లైంది కదా, కుళ్ళి కంపేనా కొట్టదా ? ఎవరో చచ్చిపోయేరని పేపరులో వేయరా ? ''ప్రమాదో ధీమతామపి'' అన్నాడు. ఎంత వారికైనా వస్తాయి. మామగారు వచ్చేవరకు వేచివుంటే ఆయన పెద్దవాడు, అన్నీ తెలిసిన వాడు. ఏంచెయ్యాలో చేస్తాడు. ఆమెను క్షమించి మళ్ళా యథాప్రకారంగా ప్రేమించ గలడా ? ఆమె తనను ఎంతలా ప్రేమించేది ! తనకు జబ్బుచేసి నెలదినాలు మంచాన్ని పట్టి నప్పుడు ఎంత ప్రేమతో ఎంత సేవ చేసింది ! ఆమె సేవవల్లనే బ్రతికేడని డాక్టర్ కూడా అన్నాడు. నాడు కూడా ఆమెపై కన్ను వేయలేదుకదా ? ఛీ, ఒక సారి తప్పు చేసిందికదా అని ఒరా అనుమా నించడం న్యాయంకాదు. ఇదే మొగాడైతే భార్య వదిలిపెట్టేస్తుందా ? ఎక్కడుందో తెలుస్తే బాగుండును. ఆమెకు నిజమైన పశ్చాత్తాపం కలిగిందో లేదో తెలుసుకో వచ్చు. ఇలా ఏవో ఆలోచనలు వరుగెడు తున్నాయి.

మామగారు రాకుండానే ఈ విషయం

ఆయనకు తెలియజేయడం మంచిదనుకుని, ఆయనకు ముక్తసరిగా జాబు వ్రాసేను :—

మామగారికి నమస్కారములు,

మీరు వ్రాసిన జాబు అందింది. పది రోజులక్రితం మీ అమ్మాయి మీ ఇంటికి వెళతాననిచెప్పి వెళ్లింది. చేరిన తరవాత జాబైనా వ్రాయలేదే అని నేను చూస్తుండగా మీ జాబు వచ్చింది. ఎక్కడకు వెళ్లింది తెలుసుకుని నాకు తెలుపగోరుతున్నాను.

ఇట్లు,

రామారావు.

ఆయన కంగారుగా బయలుదేరి వచ్చేడు. నెల్లూరునుండి మదరాసు చేరినట్లు భోగట్టా చేయగా తెలిసింది. తరువాత జాడ తెలియలేదు. ఆమె వ్రాసిపెట్టిన పుత్తరాన్ని కూడా చూపేడు.

"అల్లుడు మామ లిద్దరు ఆలోచించి పేపరులో ఆమె అచోకీ తెలిపినవారికి నూరు రూపాయలు బహుమానంగా నిచ్చెదమని ప్రచురణ చేయించేరు. దరిదాపు ఆరు నెలలైనా, మూడు నాలుగుసార్లు పేపరులో వేయించినా జవాబుమాత్రం లేదు.

## 5

సాయంత్రం ఇందిర బసకు చేరేసరికి చెల్లాయికూడా వచ్చింది. ఈలోపునే హెడ్ మిస్ట్రెసును, బంట్రోతును కూడా పంపివేసింది. కాఫీ తాగుతూ ఇద్దరు మాటలు ప్రారంభించేరు. చెల్లాయి జరిగిన కథంతా చెప్పింది. తను గొప్ప తప్పు చేసేనని, భర్త పొమ్మనగా చావలేక ఎవరికీ తెలియకుండా అక్కడ కాలం గడుపుతున్నానని, తనను గురించి అక్కడ వారికి ఏమీ చెప్పవద్దని, తన వారికికూడా తెలియజేయవద్దని బతిమిలాడింది.

ఇంతలో ఇందిర తన హేండ్‌బేగ్‌లో పదిలపరచిన ఒక కట్టింగును ఆమె చేతికిచ్చింది. అది ఆమె తండ్రి, భర్త వేయించిన ప్రకటన. "దీన్నిబట్టి నిన్ను వారిద్దరు క్షమించి ప్రేమిస్తున్నట్టు తెలుస్తూంది కదా! నువ్వు వెంటనే వారి కెందుకు వ్రాయకూడదు? నీకు అభ్యంతరం లేకపోతే నేనే వ్రాస్తా" అంది ఇందిర. "నేను వారి ముఖం చూడలేను ఇందిరా! నన్ను ఇలా వదిలేయి. పశ్చాత్తాపం చెందుతూ ఏదోవిధంగా ఇలా బతుకుతున్నా. ఈ విధంగా వుంటే పాపపరిహారం అవుతుందేమోనని కొంచెం ఆశ వుంది" అని కంట తడిపెట్టుకుంది చెల్లాయి. ఏంచేస్తే బాగుంటుందా అని ఇందిర ఆలోచిస్తూంది. అప్పుడే ఎవరో వచ్చినట్లు అలికిడైంది.

## 6

ఇనస్పెక్షను వారంరోజు లున్నదనగా పేపరు తిరగేస్తూ వుంటే ఈ ప్రకటన హెడ్ మిస్ట్రెసు కంట పడింది. ఆమెకు అనుమానం కలిగింది. పిల్లలందరు విశాలపట్ల ఎక్కువ గౌరవం చూపుచుండుటచేత కొంత ఈర్ష్య కూడా ఏర్పడ్డది. ఆమె గురించి తెలుసుకోవాలనే కుతూహలంతో ఎవరితోను చెప్పకుండా ఒక కార్డుముక్క వ్రాసి పడేసింది. అది అందగానే చెల్లాయి తండ్రి బయలుదేరుతూ, రామారావుని కూడా కాకినాడ వచ్చి తనను ట్రేవలర్సు బంగళావద్ద కలుసుకొమ్మని టెలిగ్రాం ఇచ్చేడు. ఇనస్పెక్షన్ రోజుకే వారిద్దరు కాకినాడ చేరుకున్నారు. ఇద్దరు కలిసి సాయంకాలం హెడ్ మిస్ట్రెస్‌గారిని కలుసుకున్నారు. ఆమె విశాల ఇల్లు గుర్తు చెప్పింది. అక్కడ భోగట్టా చేయగా ఇనస్పెక్ట్రెసుగారిని చూడడానికి వెళ్లినట్టు తెలిసింది. వెంటనే అక్కడకు వెళ్లేరు. వారిని చూడగానే చెల్లాయి నిలువునా నీరైపోయింది. వారి పాదాలు తన కన్నీటితో తడిపింది. ఇప్పుడు ఇంజనీరుగారు క్రొత్తచోట పోచంపాడు ప్రాజెక్టులో పని చేస్తున్నారు. ★




